క్లుప్తంగా

అన్వేశ్‌రెడ్డిని కలిసిన నేతలు


అన్వేశ్‌రెడ్డితో కాంగ్రెస్‌ నాయకులు

కడెం: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన సుంకెట అన్వేశ్‌రెడ్డిని ఆర్మూర్‌లోని తన నివాసంలో యూత్‌ కాంగ్రెస్‌ నిర్మల్‌ జిల్లా అధ్యక్షుడు పాద్దుటూరి సతీశ్‌రెడ్డి, కిసాన్‌సెల్‌ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్‌ మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా రైతుల పక్షాన పోరాటం చేసినందుకు పదవి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ వారిని సన్మానించారు.

‘ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి’

కడెం: వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల విధుల నుంచి గర్భిణులు, చిన్నారులు ఉన్న మహిళా ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశ్‌నాయక్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయమై గురువారం కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల శిక్షణ కార్యక్రమాల్లో వసతులు కల్పించి విధుల పారితోషికం పెంచాలని కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భిక్షపతినాయక్‌, అంబాజీ, చిన్నయ్య తదితరులున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

కుభీర్‌: ఎండలు పెరుగుతున్నందున ప్రజల దాహార్తి తీర్చేందుకు మండలకేంద్రంలో గురువారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మూడు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈవో విజయ్‌ పేర్కొన్నారు. వీటి నిర్వహణ చూసుకునేందుకు గ్రామపంచాయతీ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కారోబార్లు పి.బాబు, బి.ప్రకాశ్‌ సిబ్బంది ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి రామాలయం ఆలయ కమిటీ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఏలేటి గంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోచమ్మల నర్సయ్య, క్యాషియర్‌ నూకల మల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్‌ పడిగెల గంగాధర్‌, మధు తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ వస్తేనే అభివృద్ధి’


మాట్లాడుతున్న రావుల రాంనాథ్‌


సోన్‌: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకులు రావుల రాంనాథ్‌ అన్నారు. గురువారం మండలంలోని న్యూ వెల్మల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌ ఎన్నికల్లో ఆదిలాబాద్‌ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్‌, వైస్‌ ఎంపీపీ అంకుల్‌ నాగయ్య, ఎంపీటీసీ మెట్టు రాజేశ్వర్‌, అంకం శ్రీనివాస్‌, ప్రశాంత్‌, అలిశెట్టి గంగాధర్‌ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ‘ప్రశంస’


శైలజకు ప్రశంసా పత్రం అందిస్తున్న అధికారి

ఖానాపూర్‌: ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్షయ నివారణ సంస్థ ద్వారా ఖానాపూర్‌లో విధులు నిర్వహించే ల్యాబ్‌ టెక్నీషియన్‌ శైలజ ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్నారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌.. శైలజకు ప్రశంసాపత్రం అందజేశారు. ఎన్‌టీఈపీ పీవో రవీందర్‌రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

అడవి జంతువుల సంరక్షణకు చర్యలు


నీటి కుంట పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్వో రమేశ్‌

కుంటాల: జంతు సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎఫ్‌ఆర్వో రాథోడ్‌ రమేశ్‌ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దౌనెల్లి అటవీ ప్రాంతాల్లో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుంటలను పరిశీలించారు. పంటల చుట్టూ విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చేయవద్దని.. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టవద్దని గ్రామస్తులకు సూచించారు. వారి వెంట ఎఫ్‌ఎస్‌వో శ్రీనివాస్‌, ఎఫ్‌బీవో స్రవంతి ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సాక్షి స్పందన

ఖానాపూర్‌: దీనావస్థలో ఉన్న కొమిరె నడిపి రాజన్న కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన నిరుపేద కుటుంబం దీనావస్థలో ఉన్న విషయమై ఈనెల 26న సాక్షిలో ‘ఆపన్నహస్తం కోసం ఎదురు చూపు’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. పట్టణ శివారులోని మామిడి తోటలో బాధిత కుటుంబం నివాసం ఉంటున్న ప్రాంతానికి ఎమ్మెల్యే, మున్సిపల్‌ చైర్మన్‌తోపాటు నాయకులతో కలిసి వెళ్లారు. దీంతో ఆ కుటుంబసభ్యులు కంటతడి పెడుతూ ఒక్కసారిగా ఎమ్మెల్యే కాళ్లపై పడి బోరున విలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు వరుణ్‌ ఆరోగ్య పరిస్థితిని, బాధిత కుటుంబీకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వ స్థలం, ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ చిన్నం సత్యం, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు దయానంద్‌, నాయకులు నిమ్మల రమేష్‌, జన్నారపు శంకర్‌, శ్రీపాద శేషాద్రి, శనిగారపు కమలాకర్‌, గొర్రె గంగాధర్‌, వేల్పుల రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బొజ్జు కాళ్లపై పడి రోదిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ముధోల్‌ ఎమ్మెల్యే రామారావ్‌ పటేల్‌

భైంసాటౌన్‌: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పవార్‌ రామారావు పటేల్‌ అన్నారు. పట్టణంలోని ఎస్‌ఎస్‌ కాటన్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన పార్లమెంట్‌ ఎన్నికలు–అసెంబ్లీ ఎన్నికల మేనేజ్‌మెంట్‌ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా మైక్రో డోనేషన్‌ కోసం క్యూఆర్‌ కోడ్‌ ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలింగ్‌బూత్‌ల వారీగా బూత్‌ కమిటీని బలోపేతం చేయాలన్నారు. ఓటరు జాబితాను క్షుణ్నంగా తనిఖీ చేయడంతోపాటు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో మండలాల వారీగా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిల్లి శ్రీనివాస్‌, పడిపెల్లి గంగాధర్‌, సాయినాథ్‌, అయ్యన్నగారి భూమయ్య, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్యూఆర్‌ కోడ్‌ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

బీజేపీలో చేరిక

కుభీర్‌: భైంసాలోని ఎస్‌ఎస్‌ ఫ్యాక్టరీలో గురువారం ఎమ్మెల్యే రామారావ్‌ పటేల్‌ సమక్షంలో కుభీర్‌ మండల పరిషత్‌ కోఆప్షన్‌ సభ్యుడు దత్తాహరి బీఆర్‌ఎస్‌ నుంచి బీజేపీలో చేరారు. ఆయనతోపాటు గోడాపూర్‌కు చెందిన 20 మంది బీజేపీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నాయకులు రమేశ్‌, గోడాపూర్‌ తాజా మాజీ సర్పంచ్‌ ఆనంద్‌రావ్‌పటేల్‌ తదితరులు ఉన్నారు.

‘కరువుభత్యం అమలు చేయాలి’

ఖానాపూర్‌: పెరిగిన కరువుభత్యాన్ని బీడీకార్మికులకు వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్‌ అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది గ్రామంలో జరిగిన సమావేశంలో కరువుభత్యం డిమాండ్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీడీ చుట్టే కార్మికులకు ఒకే వేతనం అమలు చేయాలని కోరారు. వెయ్యి బీడీలకు కనీస వేతనం రూ.114.60, .. బోనస్‌ రూ.17.70 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న తదితరులు ఉన్నారు.

జ్వరం, దగ్గు ఉంటే వైద్యుల్ని సంప్రదించాలి

ముధోల్‌: రోజుల తరబడి జ్వరం, దగ్గు ఉంటే సమీపంలోని వైద్యుల్ని సంప్రదించాలని పిల్లల వైద్య నిపుణులు డాక్టర్‌ విజయానంద్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ప్రపంచ క్షయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డా.సాయిసువర్ధన్‌, ఎంవో డాక్టర్‌ రాహుల్‌, లాలయ్య, టీబీ సూపర్‌వైజర్‌, హెడ్‌ నర్స్‌ పద్మ, స్టాఫ్‌నర్స్‌ పార్వతి, ఏఎన్‌ఎం విజయ, సిబ్బంది ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌ రూరల్‌ మండలం అక్కాపూర్‌ గ్రామంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఐదు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రంతో వేడుకలు ముగిశాయి. రేణుక ఎల్లమ్మ, జమదగ్ని, పరశురాముడు, ఆది వినాయకుడు సహా ఇతర దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. బీజేఎల్పీ నేత, నిర్మల్‌ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కె.శ్రీహరిరావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ శోభ– సత్యనారాయణగౌడ్‌, డీసీసీబీ మాజీ చైర్మన్‌ రామ్‌కిషన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ జి.ఈశ్వర్‌, సహకార సంఘం చైర్మన్‌ గంగాధర్‌, కాలేశ్వరం ఆలయ కమిటీ డైరెక్టర్‌ దేవేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

డీసీసీ అధ్యక్షుడి పూజలు

నిర్మల్‌: సారంగపూర్‌లో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో గురువారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పూజలు చేశారు. అంతకుముందు వారిని గొల్ల,కుర్మ సంఘం నాయకులు సత్కరించి స్వాగతం పలికారు. నర్సయ్య, రాజేశ్వర్‌, సత్యపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ముత్యంరెడ్డి, మురళి ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి నూతన ఆలయంలో గురువారం దత్తసాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

బార్‌ అసోసియేషన్‌ కార్యవర్గాల ఎన్నిక


నిర్మల్‌లో ఎన్నికైన కార్యవర్గం


భైంసాలో శంకర్‌కు న్యాయవాదుల అభినందన

నిర్మల్‌టౌన్‌: జిల్లాలోని నిర్మల్‌, భైంసా, ఖానాపూర్‌ బార్‌ అసోసియేషన్‌ ఎన్నికలు గురువారం వేర్వేరుగా నిర్వహించారు. నిర్మల్‌ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో నిర్మల్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా అల్లూరి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా వై.కవితారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఏ.ముత్తన్న, కోశాధికారిగా ఏ.నర్సారెడ్డి, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా పి.వంశీకృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా సీహెచ్‌.అర్చన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక నిర్వహించగా వోస మహేందర్‌, తన ప్రత్యర్థి అభ్యర్థి ఎస్‌.లింగయ్యపై 38 ఓట్లతో తేడాతో విజయం సాధించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల అధికారులు షేర్‌ నరేందర్‌, కొమ్మోజి రమణ తెలిపారు.

భైంసాలో అధ్యక్షుడిగా శంకర్‌..

భైంసాటౌన్‌: పట్టణంలోని అసోసియేషన్‌ కార్యాలయంలో ఎన్నికల అధికారి సంతోష్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సి.శంకర్‌, ఉపాధ్యక్షుడిగా జెక్కి, ప్రధాన కార్యదర్శిగా కుంట కీర్తికుమార్‌, సంయుక్త కార్యదర్శిగా సందీప్‌, కోశాధికారిగా మాధవి, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

ఖానాపూర్‌ అధ్యక్షుడిగా సురేశ్‌

ఖానాపూర్‌: బార్‌ అసోసియేషన్‌ ఖానాపూర్‌ కార్యవర్గం ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 27 మంది ఓటర్లు ఉండగా 26 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోటీలో ఉన్న ఇద్దరికి సమానంగా ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు తెలంగాణ బార్‌ కౌన్సిల్‌ ఆదేశాల మేరకు డ్రా పద్ధతిన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంత్రరాజం సురేశ్‌ ఎన్నికయ్యారు. తర్వాత గెలుపొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ఇమాముద్దీన్‌ ఫారుఖ్‌, ప్రధాన కార్యదర్శిగా నేరెల్ల సత్యనారాయణ, కోశాధికారిగా అజీజ్‌ అహ్మద్‌, సహాయ కార్యదర్శిగా పాలంపెల్లి రాజు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి గోనె శ్రీనివాస్‌, అసిస్టెంట్‌ ఎన్నికల అధికారులు ఆసిఫ్‌ అలీ, షబ్బీర్‌ పాషా తెలిపారు. నూతన కార్యవర్గానికి ఖానాపూర్‌ కోర్టు జడ్జి జితిన్‌ స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.


ఎన్నికైన వారికి స్వీటు తినిపిస్తున్న జడ్జి జితిన్‌

‘కాంగ్రెస్‌ అభ్యర్థికి మద్దతిస్తాం’

ఖానాపూర్‌: కాంగ్రెస్‌ తరఫున ఆదిలాబాద్‌ ఎంపీగా పోటీ చేసే ఆదివాసీ మహిళా నాయకురాలు ఆత్రం సుగుణకు తామంతా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ వకీల్‌, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్‌ తెలిపారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాలుగా అవినీతిపై, మానవ, గిరిజన హక్కులను కాపాడేందుకు రాజీలేని పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సుగుణక్క అభ్యర్థిత్వాన్ని బలపరిచి గెలిపించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ అంబేద్కర్‌ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మల్లేపల్లి స్వామి, సిలివేరి శ్రీను, టీకం దేవరావు, దాసు తదితరులు ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం

- కుంటాల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గజ్జారాం యాదవ్‌

కుంటాల: అధికారులు, ప్రజాప్రతినిధులం కలిసికట్టుగా మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్‌ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో కుంటాల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధిహామీ నిధులు రూ.1.80 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఓలా రోడ్డు నుంచి రాజాపూర్‌తండా వరకు ఐటీడీఏ నిధులతో చేపట్టిన రోడ్డు పనులు కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంతో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

- ఏవో సోమలింగారెడ్డి మాట్లాడుతూ రైతునేస్తంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రైతులకు నేరుగా శాస్త్రవేత్తల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో భూసార పరీక్షలు చేయించాలని సభ్యులు కోరగా ఏవో సానుకూలంగా స్పందించారు.


మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జారాం యాదవ్‌

- ఉపాధి కూలీలకు కూలి రూ.270 నుంచి రూ.300 పెంచినట్లు ఏపీవో నవీన్‌ తెలుపగా.. పని ప్రదేశంలో వసతులు కల్పించాలని ఎంపీడీవో అబ్దుల్‌ రహీం సిబ్బందిని ఆదేశించారు.
- అంబుగామ, విఠాపూర్‌, వెంకూర్‌, అంబకంటి తండాల్లో రేషన్‌ దుకాణాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తహసీల్దార్‌ ఎజాజ్‌ అహ్మద్‌ఖాన్‌ తెలిపారు.
- మండలంలో 9,704 విద్యుత్‌ మీటర్లు ఉండగా 5,613 మీటర్లకు గృహజ్యోతి పథకం వర్తించినట్లు విద్యుత్‌ ఏఈ శివప్రసాద్‌ పేర్కొన్నారు. అద్దె ఇంట్లో ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.
- అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు నీటిని అందించేందుకు సాసర్‌ రింగ్‌లు ఏర్పాటు చేసినట్లు డీఆర్వో రేష్మ తెలిపారు.
- పోషణ్‌ పక్వాడాలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు సూపర్‌వైజర్‌ లక్ష్మి విశారద పేర్కొన్నారు.
- వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్‌ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ శుద్ధ జలం సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ శ్రీనివాస్‌ పేర్కొన్నారు. పైపులైన్‌ లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్నట్లు వెల్లడించారు.
- మండలంలోని 277 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.18.55 కోట్లను రుణాలుగా అందించినట్లు ఏపీఎం అశోక్‌ సభ్యులకు తెలిపారు.
- మండలంలోని 30 చెరువులు, కుంటల్లో 17 లక్షల 26 వేల 378 చేప పిల్లలను వదిలినట్లు మత్స్యశాఖ ఎఫ్‌ఏ గయాసొద్దీన్‌ తెలిపారు. సమావేశంలో వైస్‌ ఎంపీపీ మౌనిక నవీన్‌, కోఆప్షన్‌ సభ్యులు ఎస్‌ కే. గౌస్‌, ఎంపీటీసీలు సుధాకర్‌, కట్ట రవి తదితరులు పాల్గొన్నారు.

తొలగిన ముప్పు

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద పంచాయతీ కార్యాలయం ఎదుట ట్రాన్స్‌ఫార్మర్‌ చేతికి అందేలా ఉండటంతో ఈ నెల 20న సాక్షిలో ‘ప్రమాదకరంగా విద్యుత్‌ నియంత్రిక’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌ ఏఈ మహేశ్‌ గురువారం సిబ్బందితో ఎవరికి తగలకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి ఎత్తించి సరిచేయించారు.



బాధితులకు తక్షణ న్యాయం అందించాలి

దిలావర్‌పూర్‌: డయల్‌ 100కు ఫోన్‌ చేసే బాధితుల ఫిర్యాదులు స్వీకరించి తక్షణ న్యాయం అందించాలని నిర్మల్‌ డీఎస్పీ ఎ.గంగారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎస్సై సుమాంజలి, సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్‌(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పలు కేసుల వివరాలు, పురోగతిపై ఎస్సై హన్మాండ్లును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు చట్టాల గురించి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.


నర్సాపూర్‌(జి)లో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

ప్రసవానంతరం ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

భైంసాటౌన్‌: ప్రసవానంతరం వచ్చే ఆరోగ్య సమస్యలపై బాలింతలు శ్రద్ధ చూపాలని భైంసా అర్బన్‌ పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ ఫిర్దోస్‌ అన్నారు. పట్టణంలోని అర్బన్‌ పీహెచ్‌సీలో గురువారం అమ్మకోసం– ప్రసవానంతర సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్‌ ఆఫీసర్‌ గర్భిణులు, బాలింతలకు పలు ఆరోగ్య సమస్యలు–లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌వో గిరిబాబు, గంగన్న, నరేశ్‌, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కుంటాల: మహిళలకు ప్రసవానంతరం ప్రత్యేక ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వైద్యురాలు శృతి రెడ్డి పేర్కొన్నారు.గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమ్మకోసం కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ప్రసవానంతరం చలి జ్వరం, పొత్తి కడుపులో నొప్పి ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెడికల్‌ ఆఫీసర్‌ ఫిర్దోస్‌

భక్తి మార్గంలో పయనించాలి

తానూరు: ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరం ఉండి భక్తి మార్గంలో పయనించాలని మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లాకు చెందిన కాశీనాథ్‌ మహారాజ్‌ అన్నారు. మండలంలోని మొగ్లి గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కాళ్య కీర్తనలో పాల్గొని భక్తులకు పలు ప్రవచనాలు బోధించారు. ఆధ్యాత్మిక భావనలతో ప్రశాంతత సాధ్యమని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన వందమందికి పైగా తులసీమాలలు ధరించారు. అనంతరం ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం మహారాజ్‌లను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.


ప్రవచనం చెబుతున్న కాశీనాథ్‌ మహారాజ్‌

‘ఉపాధి’తో ఉద్యోగం

కుంటాల: ఉపాధి హామీ పథకం ఉద్యోగం కల్పించే పథకంగా మారిందని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. కుంటాల రైతువేదికలో నియోజకవర్గస్థాయి ఉపాధిహామీ సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. నైపుణ్యం లేకున్నా అడిగిన ప్రతి కూలీకి వందరోజుల పని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌ ఖర్చు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. సిబ్బంది కూలీల శ్రమదోపిడీ చేసి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీల కండువాలు వేసుకొని ప్రచారం నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీసీ గంగాప్రసాద్‌, హెచ్‌ఆర్‌ మేనేజర్‌ సుధాకర్‌, ఏపీవోలు గట్టుపల్లి నవీన్‌, జగన్‌, సుగుణ, శిరీష, శివలింగం, రాథోడ్‌ హరిలాల్‌, సదానందచారి, ఏపీఎం అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

తాగునీటి సమస్య రానీయొద్దు

కుభీర్‌: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ అన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో తాగునీటి ఎద్దడిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్‌ ఎం.సోము, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ రాజన్న, ఎంపీవో గోవర్ధన్‌ తదితరులు ఉన్నారు.

నీటిని వృథా చేయవద్దు

లోకేశ్వరం: ఎండలు పెరిగి భూగర్భజలాలు అడుగంటుతున్నందున గ్రామాల్లో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్‌ అన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో నీరు సరఫరా చేసే పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ శ్రీనివాస్‌, ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు.


కుభీర్‌లో సమావేశంలో పాల్గొన్న అధికారులు

బాబా ఆలయంలో సందడి

కుంటాల: రెండో షిర్డీగా పేరుగాంచిన మండలంలోని కల్లూర్‌ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. హారతి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.